బ్రహ్మోత్సవాల ఆహ్వానం అందజేత



నీలాగోపాల్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కమిటీ సభ్యులు

నిజాంపేట్: 26వ డివిజన్ మాజీ కార్పొరేటర్ రాఘవేంద్రరావు, శ్రీనివాస్ నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం మాజీ మేయర్ నీలా గోపాల్‌రెడ్డిని కలిశారు. 20వ తేదీన శ్రీనివాస అభయాంజనేయ స్వామి దేవస్థానంలో నిర్వహించే శ్రీభూ నీలా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరవ్వాలని ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన ఉండాలి

జీడిమెట్ల: ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలని జీడిమెట్ల ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ శేఖర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా జీడిమెట్ల ఫైర్ సిబ్బంది వివిధ కార్యక్రమాలను చేపట్టారు. మంగళవారం జీడిమెట్ల, షాపూర్‌నగర్‌లోని బస్టాపుల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్నిప్రమాదాలు జరిగినపుడు వ్యవహరించాల్సిన తీరుపై డ్రిల్ నిర్వహించారు. ఈ వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్

నిజాంపేట్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఎంసీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాచుపల్లి సాయినగర్‌లో జైబాపూ, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో చిట్ల దివాకర్, జగదీష్ యాదవ్, చౌదరి, కడియాల ఇందిరా, ప్రవీణ్, మల్లికార్జున్, మధుసూదన్‌రెడ్డి, శ్రీశైలం యాదవ్, ఏలూరి సత్య, వీరబాబు, రమేష్, సయ్యద్ రఫత్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ నాగరాజు

కుత్బుల్లాపూర్: రోడ్డు దాటే సమయంలో జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను నివారించవచ్చని అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు అన్నారు. మంగళవారం కొంపల్లిలోని లేబర్ అడ్డా వద్ద రోజువారీ కూలీలకు ట్రాఫిక్ నిబంధలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు పక్కన నడిచే సమయంలో ఫుట్‌పాత్‌లను ఉపయోగించుకోవాలని, అవి లేని ప్రాంతాల్లో రోడ్డు దాటే సమయంలో చేతులతో సిగ్నల్ ఇస్తూ దాటాలన్నారు.

నల్లా సంపుల తనిఖీ



చింతల్: నల్లాలకు మోటార్లు బిగించి నీటిని తోడితే కఠిన చర్యలు తప్పవని జలమండలి డీజీఎం రాజేష్ హెచ్చరించారు. మంగళవారం సుచిత్ర జలమండలి సెక్షన్ పరిధిలోని పద్మానగర్ ఫేజ్ 2, సాయిబాబానగర్ కాలనీల్లో మేనేజర్ శివప్రసాద్, సిబ్బందితో కలిసి పలు ఇళ్లల్లో నీటి సంపుల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి పైపులైన్లకు మోటార్లు అమరిస్తే మిగతా ఇళ్ల వాసులకు లో ప్రెషర్ తలెత్తుతుందన్నారు. అక్రమ మార్గంలో నీటిని తోడితే కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

పినిపే చిన్న అబ్బులుకు దళితరత్న అవార్డు

మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతినగర్ తోటకు చెందిన పినిపే చిన్న అబ్బులుకు బాబు జగ్జీవన్‌రామ్, డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం దళితరత్న అవార్డును అందజేశారు. సోమవారం రాత్రి రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవార్డు రావటం తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. రానున్న రోజుల్లో మరెన్నో కార్యక్రమాలు చేపడతానని తెలిపారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

- సీసీ రోడ్లు, ప్రహరీ నిర్మాణానికి రూ. 14 కోట్ల నిధులు
- యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి
- ఎమ్మెల్యే వివేకానంద్



జంట సర్కిళ్ల ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. మంగళవారం పేట్‌బషీరాబాద్ క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జంట సర్కిళ్ల పరిధిలో సీసీ రోడ్లు, ప్రహరీ నిర్మాణ పనులను చేపట్టేందుకు మొత్తం రూ. 14 కోట్ల నిధులు మంజూరయ్యాయని, వాటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయలన్నారు. గత పదేళ్లలో కోట్ల రూపాయల నిధులు వెచ్చించి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామని, ఇంకా అక్కడక్కడ మిగిలిపోయిన పనులను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. పనులు చేపట్టే సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమీక్షా సమావేశంలో ఇంజినీరింగ్ ఈఈ లక్ష్మీ గణేష్, డీఈ పాపమ్మ, శిరీష, రూపా దేవి, ఏఈలు కళ్యాణ్, తిరుపతి, అనురాగ్, అశోక్, స్వాతి పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. కుత్బుల్లాపూర్ జలమండలి అధికారులతో సమావేశం నిర్వహించారు. వివిధ కాలనీలలో మంచినీటి సరఫరా, నీటి లభ్యత, భూగర్భ డ్రైనేజీ పనులు, నూతన పైప్ లైన్ల నిర్మాణ పనులను అడిగి తెలుసుకున్నారు. నీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పెండింగ్‌లో ఉన్న భూగర్భ డ్రైనేజీ, వరద నీటి కాలువ, మంజీరా పైపులైన్ పనులను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జలమండలి డీజీఎంలు రాజేష్, శ్రీకాంత్, రవీందర్ నాయక్, మేనేజర్లు రవి, శివ ప్రసాద్, మహేష్, ఈశ్వరయ్య, రోహిణి, ఝాన్సీ, రమ్య భారతి, పూజిత తదితరులు పాల్గొన్నారు.

12 వేలకు పైగా ధ్రువపత్రాలు జారీ



మల్లికార్జునరావు, డిప్యూటీ తహసీల్దార్

సుభాష్‌నగర్: గడిచిన 27 రోజుల వ్యవధిలో కుత్బుల్లాపూర్ మండలంలో రికార్డు స్థాయిలో 12 వేలకు పైగా కుల, ఆదాయ ధ్రువపత్రాలను జారీ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారెంటీలలో భాగంగా యువ వికాసం పథకాన్ని మార్చి 17 నుండి అధికారికంగా మొదలుపెట్టారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన యువత నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. ప్రభుత్వం మరోసారి మరో వారం రోజులపాటు దరఖాస్తులకు గడువు పెంచిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకునే వారికి కుల, ఆదాయ ధ్రువపత్రాలు తప్పనిసరి. దీంతో యువత పెద్ద సంఖ్యలో కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి ఉదయం నుండే తరలివచ్చారు. సాధారణ రోజుల్లో కుల, ఆదాయ ధ్రువ పత్రాల నిమిత్తం 100 నుంచి 120 వరకు దరఖాసులు వచ్చేవి. కొన్ని రోజుల నుండి నిత్యం వెయ్యికి పైగా దరఖాస్తులు రావడంతో తహసీల్దార్ కార్యాలయం రద్దీగా ఏర్పడింది. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునరావు మాట్లాడుతూ.. కుల, ఆదాయ ఇతర సర్టిఫికెట్ మంజూరులో జనాలకు ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బందితో అదనంగా సమయం కేటాయించి రోజుకు 800 పైగా సర్టిఫికెట్లను జారీ చేశామన్నారు. సర్వర్ డౌన్ కారణంగా కొంత అంతరాయం ఏర్పడినప్పటికీ ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తున్నామని తెలిపారు.

కార్యాలయం ప్రారంభం

జగద్గిరిగుట్ట: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ సంఘం కార్యాలయాన్ని జాతీయ మైనార్టీ అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ జాంగిర్ హుస్సేన్ మంగళవారం ప్రారంభించారు. అదే విధంగా నూతనంగా ఎన్నికైన ఎస్సీ, ఎస్టీ, బీసీ సుభాష్ చంద్రబోస్ నగర్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులను సన్మానించారు. కాలనీ సొసైటీ అధ్యక్షుడిగా శివ నారాయణ, ఉపాధ్యక్షుడిగా బాపూజీ నారాయణ, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ ఇతర కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐలయ్య గౌడ్, రాష్ట్రీయ దళిత సేన జాతీయ ప్రధాన కార్యదర్శి వై బాలరాజు, ఉపాధ్యక్షులు ఎం జనార్దన్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంటీ యూనియన్ అధ్యక్షుడు సుబ్బారావు మృతి



సుబ్బారావు (ఫైల్)

సుభాష్‌నగర్: హెచ్ఎంటీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు మాల్ సుబ్బారావు మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నగరంలోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కార్మిక నాయకుడు దివంగత మంత్రి పి.జనార్దన్‌రెడ్డికి ముఖ్య అనుచరుడు. మాల్ సుబ్బారావు మృతి పట్ల సినీ నటుడు మహేష్, సీనియర్ సంపాదకుడు రంగ సీతారామ్, ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు తాడి రంగారావు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్‌లో సుబ్బారావు అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

క్రమం తప్పకుండా మందులు వాడాలి



కిట్లు అందజేస్తున్న వైద్యాధికారిణి స్వర్ణలత

దుండిగల్: క్షయ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులను వాడటం వల్ల త్వరగా కోలుకుంటారని కుత్బుల్లాపూర్ వైద్యాధికారిణి డాక్టర్ స్వర్ణలత అన్నారు. దుండిగల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం క్షయ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషియన్ కిట్లను అందజేశారు. ప్లాన్ ఇండియా అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రెండు నెలలకు సరిపడా పోషకాహారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యాధిగ్రస్తులు మందులతో పాటు పోషకాహారాలను వాడాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సిరాజుద్దీన్, క్షయ వ్యాధి విభాగం ఉద్యోగులు కిశోర్, శ్రవణ్ కుమార్, రవీందర్ రావు, ప్లాన్ ఇండియా ప్రతినిధి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్ సమస్యను పరిష్కరించరా?

పనులు చేయకుండానే పూర్తి చేసినట్లు మెసేజ్



సమస్య పరిష్కారమైందని వచ్చిన మెసేజ్



శ్రీనివాస్‌నగర్‌లో డ్రైనేజీ మ్యాన్ హోల్‌లో ఏర్పాటు చేసిన కట్టెలు

చింతల్: చింతల్ శ్రీనివాస్ నగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఈనెల 9వ తేదీన భూగర్భనేజీ మ్యాన్ హోల్ 12 ఏర్పాటు చేయాలని జలమండలి కస్టమర్ కేర్ 115313 నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. 1917 టోకెన్ నెంబర్‌తో ఫిర్యాదు చేయబడింది. కానీ జలమండలి సిబ్బంది, అధికారులు సదరు సమస్య ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి సమస్య పరిష్కారం చేయకముందే 11వ తేదీన 2974 టోకెన్ నెంబర్‌తో సమస్య పరిష్కారమైందని మెసేజ్ రావడంతో సదరు వ్యక్తి ఆశ్చర్యపోయాడు. వెంటనే అతను సంబంధిత సెక్షన్ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారాన్ని తెలుపగా.. టోకెన్ నెంబర్‌ని మరల రీ ఓపెన్ చేస్తామని తెలిపినా నేటికీ సమస్య అలాగే ఉంది. అధికారులు ఏ సమస్యకైనా తమ ఫిర్యాదు చేస్తే చాలు క్షణాల్లో తమ సిబ్బంది వాలిపోయి రెండు మూడు రోజుల్లోనే సమస్య తీరిపోతుందని ప్రకటిస్తున్న జలమండలి.. ఆచరణలో మాత్రం అమలు కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మహిళ మృతి ఘటనలో వైద్యుడి రిమాండ్

ఆసుపత్రి యాజమాన్యంపై కేసు నమోదు

నిజాంపేట్: వైద్యం వికటించి ఓ మహిళ మృతి చెందిన కేసులో ఓ వైద్యుడిని రిమాండ్‌కు తరలించారు. ఆసుపత్రి యాజమాన్యంపై బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఉపేందర్ వివరాల ప్రకారం.. గత సంవత్సరం జూలైలో బాచుపల్లిలోని ఎస్ఎల్‌జీ ఆసుపత్రిలో సరస్వతి (43) కడుపు నొప్పితో ఆసుపత్రిలో చేరింది. వైద్యులు ఆపరేషన్ చేశారు. అనంతరం ఆమె మృతి చెందింది. సరస్వతి కుమారుడు ప్రమోద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేశారు. ప్రస్తుతం పోస్టుమార్టం రిపోర్టు వచ్చింది. దీంతో వైద్యుడి నిర్లక్ష్యం వల్లే సరైన వైద్యం అందక మృతి చెందిందన్న నివేదిక ఆధారంగా పోలీసులు డా.సతీష్‌కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అదే విధంగా ఇందుకు బాధ్యులైన ఎస్ఎల్‌జీ ఆసుపత్రి యాజమాన్యంపై సైతం కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ భూములను సంరక్షించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సతీష్

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ భూములను సంరక్షించాలని మంగళవారం ఆకుల సతీష్ తహసీల్దార్ పూల్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వ భూములు పదే పదే కబ్జాకు గురవుతున్నా నామమాత్రంగా చర్యలు తీసుకోవడం వల్ల మళ్లీ కబ్జాలకు పాల్పడుతున్నారని తెలిపారు. కబ్జాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అమలేశ్వరి, కవితారెడ్డి, ఎల్ల స్వామి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సుభాష్‌నగర్ పైప్ లైన్ రోడ్డుకు వెళ్లే ప్రధాన రహదారిపై మంగళవారం మధ్యాహ్నం ఓ ఆటోలో చెరుకు కట్టెలను తరలిస్తూ ప్రమాదకరంగా ప్రయాణం చేయడం పలు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ట్రాలీ ఆటోలో తరలించాల్సిన చెరుకు గడలను ప్యాసింజర్ ఆటోలో తరలించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతినిత్యం చలాన్ల పేరుతో వేధించే ట్రాఫిక్ పోలీసులు ఇటువంటి ఆటోలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

-కుత్బుల్లాపూర్

సన్నబియ్యంతో పేదల కడుపు నింపుతున్న ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: సన్నబియ్యం పంపిణీతో ప్రభుత్వం పేదల కడుపు నింపుతుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం డివిజన్ లెనిన్ నగర్‌లో సన్నబియ్యం లబ్ధిదారులైన దళిత కుటుంబం లక్ష్మమ్మ- భాస్కర్ ఆహ్వానం మేరకు మంగళవారం వారి కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం లబ్ధిదారుని ఇంట్లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఎన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి ప్రజలే గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి, బుచ్చిరెడ్డి, రషీద్ బేగ్, రాజిరెడ్డి, రామ్ నర్సయ్య, రామిరెడ్డి, శ్రీనివాస్, నాగరాజు, శ్రీదేవి, చంద్రవతి, లత, రవి, మధు తదితరులు పాల్గొన్నారు.

వీధి లైట్లకు మరమ్మతులు చేయాలని వినతి



డీసీకి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

కుత్బుల్లాపూర్: సుభాష్‌నగర్ డివిజన్ పరిధి ఎస్ఆర్ నాయక్ నగర్‌లో వీధి లైట్లు వెలగడం లేదని మాజీ ఏరియా కమిటీ సభ్యుడు గుబ్బల లక్ష్మీనారాయణ, కాలనీ మాజీ అధ్యక్షుడు ఆలూరీ వెంకట శేషయ్య అన్నారు. ఈ మేరకు కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో ఉప కమిషనర్ నరసింహకు వినతిపత్రం అందజేశారు. ఎస్ఆర్ నాయక్ నగర్‌లో కొన్ని రోజులుగా 25 లైట్లు వెలగడం లేదని, దీంతో రాత్రి సమయాల్లో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఆయన సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. అదే విధంగా శానిటేషన్‌కు సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించాలని సర్కిల్ వైద్యాధికారి కవితను కోరారు.

తాత్కాలిక బస్ షెల్టర్ల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



కొంపల్లి ఫ్లైఓవర్ సమీపంలో ..

కుత్బుల్లాపూర్: ఎట్టకేలకు ప్రయాణికుల సౌకర్యార్థం తాత్కాలిక బస్ షెల్టర్ ఏర్పాటుకు మేడ్చల్ డిపో అధికారులు ముందుకు వచ్చారు. సుచిత్ర నుంచి కొంపల్లి వరకు జరుగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులతో ఇరువైపులా ఉన్న బస్ షెల్టర్లను తొలగించడంతో ప్రయాణికులు రోడ్డు మీదనే నిలబడి బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ విషయంపై ఈ నెల 13వ తేదీన సాక్షిలో 'బస్ షెల్టర్ ఏర్పాటు చేయరూ!' అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. కథనానికి మేడ్చల్ డిపో మేనేజర్ సుధాకర్ స్పందించి తాత్కాలిక బస్ షెల్టర్లను ఏర్పాటు చేశారు. కొంపల్లి, వెన్ సాయి ప్రాంతాల్లో ప్రయాణికులకు తడకలతో కూడిన షెల్టర్ ఏర్పాటు చేయడంతో మంగళవారం ప్రయాణికులు అందులో నిలబడి బస్సు రాగానే వెళ్లిపోవడం కనిపించింది. సాక్షి కథనంతో డిపో మేనేజర్‌ను కలిసి విన్నవించామని బీజేపీ కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు పెద్ద బుద్దుల సతీష్ సాగర్ అన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



కొంపల్లిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఏఈ శ్రీనివాస్

కుత్బుల్లాపూర్: విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని కొంపల్లి ఏఈ శ్రీనివాస్ అన్నారు. కొంపల్లి మున్సిపల్ 2వ వార్డులో , 5వ వార్డులోని సాయిబాబా నగర్, పోచమ్మ గడ్డలో నెలకొన్న లో ఓల్టేజీ సమస్యలపై మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏఈని కలిసి విన్నవించారు. దీనిపై స్పందించిన ఆయన మంగళవారంలో ఓల్టేజీ సమస్య నెలకొన్న ఆయా ప్రాంతాల్లో 5 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్‌గౌడ్, అంజి ముదిరాజ్, రాజశేఖర్‌రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

టెండర్ లేకుండానే పెయిడ్ పార్కింగ్ సరికాదు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఎటువంటి టెండర్ లేకుండా పెయిడ్ పార్కింగ్ పెట్టడం సరికాదని కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు గణేష్ అన్నారు. మంగళవారం జగద్గిరిగుట్టలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు కొండపై పార్కింగ్ చేయడానికి ఎటువంటి నిబంధనలు ఉండేవి కావని, కొత్తగా ఏర్పడిన వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీకి చెందిన కొందరు వాళ్లకు తెలిసిన వారికి ఎటువంటి టెండర్ లేకుండా ఇచ్చారని అన్నారు. నిబంధనల ప్రకారం ఆలయ ఆవరణలో ఆలయ అభివృద్ధికి తోడ్పడే ఏ పని అయినా తప్పనిసరిగా టెండర్ పిలవాలని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఆలయ కమిటీ టెండర్ పిలిస్తే సరైన నిర్ణయం తీసుకున్నవారవుతారని అన్నారు. దీనిపై ఆలయ చైర్మన్, ఈఓని వివరణ కోరగా.. ఆలయ అభివృద్ధికి సంబంధించిన దానిలో భాగంగానే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని, ఒక నెలలో ఈ టెండర్ విషయమై చర్చించి ఓపెన్ టెండర్ పిలుస్తామని వారు తెలిపారు. టెండర్ పై పూర్తిగా ఎవరికి బాధ్యతలు ఇవ్వలేదని అన్నారు.

విజిబుల్ పోలీసింగ్



అపురూప కాలనీలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ మల్లేష్

జీడిమెట్ల: జీడిమెట్ల పోలీసులు విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా మంగళవారం రాత్రి చింతల్ అంబేడ్కర్‌నగర్, అపురూప కాలనీలో పర్యటించారు. కాలనీల్లో సీసీ కెమెరాల పనితీరు తెలుసుకున్నారు. అనంతరం జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు, పోలీసులకు మధ్య స్నేహపూరిత వాతావరణం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నాయుడు రమణ, తిప్పారెడ్డి, గణేషన్, కాలనీల ప్రజలు పాల్గొన్నారు

మ్యాన్‌'హోల్'.. మరమ్మతులు లేవ్!



జీడిమెట్ల డివిజన్ పరిధిలోని గంగా ఎన్‌క్లేవ్ నుంచి అపర్ణ వెళ్లే రోడ్డులో మ్యాన్ హోల్ మూత పగిలి ఉంది. దాని పైన ఉన్న ఇనుప చువ్వలు తేలి అటువైపుగా వెళ్లే వాహనాలు పంచర్ అవుతుండటంతో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ స్కూల్ డ్రైవర్లు చెట్టుకొమ్మను అందులో పెట్టి ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇక్కడ మ్యాన్ హోల్ మూత మరమ్మతులు చేయాలని అధికారులను కోరినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. - కుత్బుల్లాపూర్

పేరుకుపోయిన చెత్త.. తొలగించకుంటే ఎట్లా!

గాజులరామారం సర్కిల్ పరిధిలోని సంజయ్ గాంధీనగర్ ప్రధాన చౌరస్తాలో పారిశుధ్య సమస్య కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుంది. ప్రతిరోజు ఇక్కడ చెత్తను తొలగించే సిబ్బంది వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన చెత్తను ఈ రోడ్డుపై వేసి వెళ్తున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని కోరుతున్నారు. - కుత్బుల్లాపూర్

